క్లుప్తంగా

ఆకట్టుకున్న సైన్స్ ప్రాజెక్టుల ప్రదర్శన



సైన్స్ ప్రాజెక్టులను తిలకిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

టెక్కలి: స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన సైన్స్ ప్రాజెక్టుల ప్రదర్శన ఆకట్టుకుంది. పాఠశాలలో ఆరు నుంచి పదో తరగతి విద్యార్థులంతా ప్రధానోపాధ్యాయురాలు శోభారాణి నేతృత్వంలో సుమారు 79 సైన్స్ ప్రాజెక్టులను రూపకల్పన చేసి ప్రదర్శన చేశారు. ఇందులో వాచ్ ఫర్ ఉమెన్ సేఫ్టీ, సోలార్ ప్లానెటరీ యాక్టింగ్ ఫోర్స్ ప్రాజెక్టులను ఉత్తమంగా ఎంపిక చేశారు.

నేడు మందసలో ఉచిత నేత్ర వైద్య శిబిరం

మందస: మందస పట్టణంలోని ఒరియా యంగ్‌మెన్ లైబ్రరీలో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని నిర్వాహకులు ఒక ప్రకటనలో బుధవారం తెలిపారు. సోంపేటలోని ఆరోగ్యవరం నేత్రవైద్యశాల వైద్యులు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా కళ్లద్దాలు అందజేస్తారన్నారు. శిబిరాన్ని స్థానికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సీఎం జగన్ పర్యటనకు సర్వం సిద్ధం

● ఏర్పాట్లు పరిశీలించిన అధికారులు, నాయకులు



కంచిలి: మకరాంపురం వద్ద ఏర్పాట్లు పరిశీలిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ విజయ, ఎమ్మెల్సీ రామారావు, సమన్వయకర్త సాయిరాజ్



కాశీబుగ్గ: హెలీప్యాడ్ వద్ద బాంబుస్క్వాడ్ తనిఖీలు

కంచిలి/కాశీబుగ్గ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల్లో జరపనున్న పర్యటనకు సర్వం సిద్ధంమైంది. ఇందుకోసం అధికారులు సైతం పూర్తి ఏర్పాట్లు చేశారు. సీఎం పర్యటన చేయనున్న ప్రాంతాల్లో ప్రజాప్రతినిధులు బుధవారం పర్యటించి ఏర్పాట్లు పరిశీలించారు. కంచిలి మండలంలోని మకరాంపురంలో ఏర్పాట్లను జెడ్పీ చైర్పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు, ఇచ్ఛాపురం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త పిరియా సాయిరాజ్‌లు పరిశీలించారు. మకరాంపురం వద్ద నిర్మించిన వైఎస్సార్ సుజలధార వాటర్‌ట్యాంక్, పంప్ హౌస్ వద్ద ఏర్పాట్లను, అంపురం వద్ద ఏర్పాటు చేసిన హెలీప్యాడ్ పనుల్ని సమీక్షించారు. ఎస్పీ జి.ఆర్.రాధికతో భద్రతా ఏర్పాట్లపై చర్చించారు. అలాగే పలాసలో జరగనున్న సభా వేదికను పలువురు పరిశీలించారు. అలాగే సీఎం రాక నేపథ్యంలో ట్రయల్‌రన్‌గా సభా వేదిక పరిసరాల్లో అధికారులు పంపించిన హెలీకాప్టర్ బుధవారం చక్కర్లు కొట్టింది. ఇక్కడ ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌లో హెలీకాప్టర్ ల్యాండ్ అయింది. సిబ్బంది ఇక్కడే మధ్యాహ్న భోజన విరామం తీసుకుని అనంతరం విశాఖ వెళ్లిపోయారు. హెలిప్యాడ్ వద్ద బాంబ్‌స్క్వాడ్ తనిఖీలు చేశారు. కాగా హెలీకాప్టర్‌ను చూసేందుకు స్థానికులు ఎగబడ్డారు. పలాసలో జరగనున్న ముఖ్యమంత్రి బహిరంగ సభా స్థలాన్ని ఎమ్మెల్సీ నర్తు రామారావు బుధవారం పరిశీలించారు.

నేడు పీర్లకొండ యాత్ర

ఇచ్ఛాపురం: మతసామరస్యానికి ప్రతీకగా నిలిచే పీర్లకొండ యాత్ర గురువారం జరగనుంది. ఇచ్ఛాపురం పట్టణానికి పడమర వైపున ఉన్న పీర్లకొండపై మార్గశిర గురువారం సందర్భంగా జరగనున్న యాత్రకు ఏర్పాట్లను నిర్వాహకులు పూర్తిచేశారు. ఈ యాత్రకు పశ్చిమబెంగాల్, కోల్‌కత్తా, ఒడిశా, విశాఖపట్నం, రాజమండ్రి ప్రాంతాల నుంచి ‘50 వేల మంది యాత్రీకులు తరలివచ్చే అవకాశం ఉంది. అవాంఛనీయ సంఘటనలకు ఆస్కారం లేకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాట్లు చేశారు.



నేడు వాహనాల మళ్లింపు

కాశీబుగ్గ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పర్యటన నేపథ్యంలో ప్రజలకు ఇబ్బంది లేకుండా పలాసలో గురువారం ట్రాఫిక్ నిబంధనలను పోలీసులు విధించారు.

● ఇచ్ఛాపురం నుంచి కోసంగిపురం జంక్షన్ మీదుగా పలాసకు రావలసిన ద్విచక్ర, కార్లు, బస్సులు, ఇతర వాహనాలు హైవేలోని ఫ్లైఓవర్ పైనుంచి ముందుకు వెళ్లి మొగిలిపాడు జంక్షన్ మీదుగా పలాస పట్టణంలోకి రావాల్సి ఉంటుంది. ఇదే ప్రాంతం నుంచి సభకు హాజరయ్యేవారంతా నేరుగా కాశీబుగ్గ వైపు పాత హైవే పైనుంచి రావాలి.

● బెండిగేటు నుంచి మూడురోడ్ల జంక్షన్ మీదుగా కోసంగిపురం జంక్షన్ వైపునకు వెళ్లాల్సిన వాహనదారులు మూడు రోడ్ల జంక్షన్ నుంచి కాశీబుగ్గ పాతబస్టాండ్ మీదుగా పలాస వెళ్లి మొగిలిపాడు జంక్షన్ మీదుగా ఎన్‌హెచ్-16 మీదుగా కోసంగిపురం జంక్షన్ వైపు వెళ్లాలి.

● సభాస్థలం వద్దకు ప్రజలను తీసుకొనివచ్చే వాహనాలు మొగిలిపాడు నుంచి వచ్చి.. కాశీబుగ్గ పాత బస్టాండ్ వద్ద ప్రజలను దించేసిన తరువాత పలాస ఆర్టీసీ డిపో వద్ద పార్క్ చేయాలి. అక్కడ పార్కింగ్ స్థలం నిండిపోతే ప్రభుత్వ కాలేజీ వద్ద కేటాయించిన స్థలంలో వాహనాలను పార్క్ చేయాలి.

● బెండిగేటు నుంచి వచ్చే వాహనాలు కాశీబుగ్గ మూడురోడ్ల గుండా పాతబస్టాండ్ వద్దకు చేరుకొని అక్కడ జనాలను దించేసి పలాస ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద పార్క్ చేయాలి.

● అక్కుపల్లి నుంచి వచ్చే వాహనాలు అక్కుపల్లి జంక్షన్ వద్దకు చేరుకొని..అక్కడ జనాలను దించేసిన తరువాత కోసంగిపురం జంక్షన్ దగ్గర్లోని ఇండస్ట్రీల్ ఏరియాలో కేటాయించిన స్థలంలో వాహనాలను నిలిపాలి.

● హెలీప్యాడ్ వద్దకు వెళ్లేందుకు అనుమతి ఉన్నవారు తమ వాహనాలను మంత్రి సీదిరి అప్పలరాజు క్యాంప్ ఆఫీస్ వద్ద పార్క్ చేయాలి.

● అక్కుపల్లి జంక్షన్ నుంచి వచ్చే ఖాళీ వాహనాలను కాశీబుగ్గ పట్టణం వైపునకు అనుమతించరు అలాగే రైల్వేస్టేషన్‌కి వెళ్లే ప్రయాణికులు ఉదయం ఎనిమిది గంటలకు ముందే టిక్కట్‌తో రైల్వే స్టేషన్‌కి చేరుకోవాలి. ఫైనిబంధనలన్నీ ఉదయం తొమ్మిది గంటల నుంచి సీఎం పర్యటన పూర్తయ్యేవరకు వర్తిస్తాయని పోలీసులు స్పష్టం చేశారు.



సీఎం జగన్‌కు మద్దతివ్వండి

● టెక్కలి సమన్వయకర్త దువ్వాడ వాణి



కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న దువ్వాడ వాణి

కోటబొమ్మాళి: సంక్షేమ సారధిగా పేరుగాంచిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రానున్న ఎన్నికల్లో మరోమారు మద్దతు పలకాలని టెక్కలి వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దువ్వాడ వాణి ప్రజలను కోరారు. కోటబొమ్మాళి 1, 2 సచివాలయాల పరిధిలోని విద్యుత్‌నగర్‌కాలనీలో ‘గడప గడపకు మన ప్రభుత్వం’ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమాన్ని వివరించి బ్రోచర్లను అందజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు బాడాన మురళి, వైస్ ఎంపీపీ బోయిన నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఇబ్బందుల్లేకుండా ధాన్యం కొనుగోలు

టెక్కలి: రైతులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా ధాన్యాన్ని కొనుగోలు చేయాలని టెక్కలి వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దువ్వాడ వాణి అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలకు అనుగుణంగా పక్కాగా ధాన్యం కొనుగోలు చేసే విధంగా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. టెక్కలిలోని తన కార్యాలయంలో నియోజకవర్గస్థాయి వ్యవసాయాధికారులతో బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి నియోజకవర్గంలో దిగుబడులు, ఇటీవల తుఫాన్ ప్రభావంతో సంభవించిన నష్టాలు, ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పరిస్థితులపై చర్చించారు. ఏడీ బి.వి.తిరుమలరావు, ఏవోలు రంగారావు, ఆర్.అప్పారావు, శ్రీకాంత్‌వర్మ పాల్గొన్నారు.



